క్లుప్తంగా

పీఆర్‌సీ బకాయిల విడుదలపై హర్షం

కల్లూరు: పశు సంవర్ధకశాఖ అనుబంధంగా పశుగణాభివృద్ధి సంస్థలలో 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న గోపాల మిత్రలకు పీఆర్‌సీ బకాయిలు విడుదల చేయడం పట్ల గోపాల మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ఖమ్మంపాటి అప్పారావులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పశుగణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న 1,530 మందికి పెండింగ్ పీఆర్‌సీ బకాయిలు రూ.7,36,18,360 ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేసినందుకు గోపాలమిత్రలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్రల మండల అధ్యక్షులు కోటేశ్వరరావు, ధరావత్ రవికుమార్, పి.వెంకటేశ్వర్లు, డి.విజయ్‌కుమార్, డి.కృష్ణప్రసాద్, పి.హనుమంతరావు, శివకృష్ణ, ఆర్ రమేష్, నాగిరెడ్డి, కె.భాస్కర్, బి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

దాడులను ఖండించాలి

ఎర్రుపాలెం: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని, దాడుల నివారణకు పీఎం మోదీ వెంటనే చర్యలు తీసుకోవాలని పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు పాస్టర్ కోట ఆదామ్ ఎలీషా కోరారు. గురువారం మండలకేంద్రంలో పలువురు చర్చి ఫాదర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాదర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించారు. సంఘం బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు సైమన్, జైపాల్, జయరాజు, మోషే, సుధాకర్, చిరంజీవి, యోహాను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవా కేంద్రం ఏర్పాటు ఎన్నడో..

సత్తుపల్లిటౌన్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు తెలంగాణ ప్రభుత్వం మున్సిపాలిటీల్లో ప్రజాసేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. మార్చి 16న ఎన్నికల కోడ్ రావటంతో ఈ సేవలు నిలిచిపోయాయి. ఇటీవల ఎన్నికల సంఘం కోడ్ ఎత్తివేసినట్లు ప్రకటించినప్పటికీ మున్సిపాలిటీలో ఈ ప్రజాసేవా కేంద్రం ఏర్పాటు చేయకపోవటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లులకు రాయితీ పథకం ఉండటంతో ఈ పథకానికి దరఖాస్తులు సమర్పించేందుకు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. సత్వరమే ప్రజాసేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో సాయిబాబాకి అర్చకులు పూజలు నిర్వహించారు. గురువారం బాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. శ్రీసాయికి కర్పూర హారతులిచ్చి పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో పలువురు దాతలు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిరుపేద వృద్ధ మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రెడ్డెం రామకృష్ణారెడ్డి కుమారుడు ఉమా మహేశ్వరరెడ్డి జన్మదినం సందర్భంగా నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం నారాయణపురం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న తడికమళ్ల నరసింహారావు కుమార్తెకు రూ.5 వేలు నగదు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, డిస్ట్రిక్ జాయింట్ సెక్రటరీ కర్నాటి లక్ష్మారెడ్డి, నంబూరి కనకదుర్గ ప్రసాద్, బెల్లంకొండ ఆంజనేయులు, శీలం వెంకట్‌రెడ్డి, వేమిరెడ్డి నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దగ్గుల ప్రభాకర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, ఎస్‌బీ.ప్రసాద్ పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయానికి కారేపల్లి బస్టాండ్ సెంటర్ బృందావన్ బేకరి యజమాని చిరునోముల మాధవ్ రూ.5వేల విలువైన మైక్‌సెట్ సామగ్రిని గురువారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి నాగసాయిశర్మ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి ముందుకు వస్తున్న భక్తులకు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఉత్సవాలు

కారేపల్లి: కొలిచిన వారికి కొంగు బంగారమైన భక్తుల కోర్కెలు తీర్చే కారేపల్లి శ్రీపెద్దమ్మతల్లి ఆలయం 8వ వార్షికోత్సవానికి ముస్తాబైంది. ఈ నెల 14నుంచి 16వరకు నిర్వహించే ఉత్సవాలకు కారేపల్లి గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. 14వ తేదీ దేవాలయంలో మామిడి తోరణాలు అలంకరణ, 15న విఘ్నేశ్వర పూజ, అభిషేకం, కుంకుమార్చన, హోమం, మధ్యాహ్నం మహా అన్నదానం, సాయంత్రం శ్రీపెద్దమ్మతల్లి గ్రామ సేవ ఊరేగింపు, 16న గ్రామ భక్తులు, మహిళలచే బోనాలు సమర్పించుట వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మల్లిఖార్జునశర్మ, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సారూ.. బ్రాంచ్ మార్చరూ..!

చింతకాని బ్రాంచే కానీ నాగులవంచలో నిర్వహణ

- డీసీసీబీ బ్రాంచ్‌ను మండల కేంద్రానికి మార్చాలని రైతుల వినతి
- పట్టించుకోని అధికారులు
- ఆవేదన చెందుతున్న రైతులు


నాగులవంచలో ఏర్పాటు చేసిన చింతకాని డీసీసీబీ బ్రాంచ్

మండల కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చింతకాని బ్రాంచ్‌ను నాగులవంచ గ్రామంలో ఏర్పాటు చేయటంతో బ్యాంక్ సేవలను పొందేందుకు మండల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డీసీసీబీ చింతకాని బ్రాంచ్‌ను మండల కేంద్రం చింతకానిలో ఏర్పాటు చేసేందుకు అనువైన భవన సదుపాయం లేక తాత్కాలికంగా నాగులవంచలో 2017 సెప్టెంబర్ 25న బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు.

చింతకాని: మండలంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు చింతకాని, నాగులవంచ గ్రామాల్లో ఉన్నాయి. చింతకాని సొసైటీలో 18 గ్రామాలకు చెందిన 2,800 మంది, నాగులవంచ సొసైటీలో 8 గ్రామాలకు చెందిన 1,159 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ రెండు సొసైటీల పరిధిలోని ఉన్నటువంటి రైతులకు సేవలు అందించేందుకు డీసీసీబీ చింతకాని బ్రాంచ్‌ను ఏర్పాటు చేసింది కానీ.. అది మండలానికి చివరన ఉన్నటువంటి నాగులవంచ గ్రామంలో.. చింతకాని సొసైటీ పరిధిలో గల 18 గ్రామాల రైతులు బ్యాంక్‌కు రావాలంటే తీవ్ర వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

బ్యాంక్ సేవలను పొందేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బ్యాంక్ ఏర్పాటు చేసేందుకు అనువైన నూతన భవనాన్ని చింతకాని సొసైటీ ఆవరణలోనే సొసైటీ పాలకవర్గ సభ్యులు నిర్మించారు. నాగులవంచ గ్రామంలో ఏర్పాటు చేసిన డీసీసీబీ చింతకాని బ్రాంచ్‌ను మండల కేంద్రానికి మార్చాలని పలుమార్లు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.22 కోట్ల పంట రుణాలు..

డీసీసీబీ చింతకాని బ్రాంచ్‌లో 2,900 సాధారణ పొదుపు ఖాతాలు, 1,020 రైతుల పొదుపు ఖాతాలున్నారు. ఈ బ్రాంచ్ నుంచి చింతకాని, నాగులవంచ సొసైటీ పరిధిలో ఉన్నటువంటి రైతులతో పాటు బ్యాంక్ ద్వారా రైతులకు నేరుగా మొత్తం రూ.22 కోట్లు పంట రుణాలను అందించారు. పంట రుణాలే కాకుండా మార్టిగేజ్ రుణాలు రూ.18 కోట్లు, విద్యా రుణాలు రూ.6 కోట్లు ఇచ్చారు. అంతేకాకుండా బ్యాంక్ డిపాజిట్లు రూ.12 కోట్లు, రైతుల రుణమాఫీ నగదు రూ.11 కోట్లు జమ అయినట్లు బ్యాంక్ సిబ్బంది తెలిపారు.

ఆవేదనలో రైతులు..

రైతులు పండించిన పంట ఉత్పత్తులను ప్రతి ఏడాది మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలు కొనుగోలు చేస్తున్నాయి. పంట ఉత్పత్తుల కొనుగోలు డబ్బులు కొంతమంది రైతులకు ఖాతాలున్న డీసీసీబీ చింతకాని బ్రాంచ్‌లో జమ అవుతుంటాయి. వాటిని తీసుకోవడానికి నాగులవంచకు వెళ్లాలంటే కనీసం ఒకరోజు పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నూతన భవనాన్ని నిర్మించాం..



రైతుల ఇబ్బందుల దృష్ట్యా చింతకాని సొసైటీ ఆవరణలో రూ.24 లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించాం. ఆ భవనంలోకి నాగులవంచలోని బ్రాంచ్‌ను మార్చాలని పలుమార్లు అధికారులకు, బ్యాంక్ పాలకవర్గ సభ్యులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదు.
– కొండపల్లి శేఖర్‌రెడ్డి, చింతకాని సొసైటీ చైర్మన్

రైతులకు మెరుగైన సేవలు..



రైతులు పూర్తిస్థాయిలో బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలంటే బ్రాంచ్‌ను చింతకానికి మార్చితే చింతకాని సొసైటీలోని 18 గ్రామాల రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది. దీనికి తోడు మండల కేంద్రంలో బ్రాంచ్ ఉంటే బ్యాంక్ మరింతగా అభివృద్ధి చెందుతుంది.
– మారగాని శ్రీనివాసరావు, చింతకాని సొసైటీ సీఈఓ

ఇబ్బంది అవుతుంది..



నాతో పాటుగా చాలా మంది రైతులు వ్యవసాయ రుణాల విక్రయంద్వారా జమఅయ్యే నగదును తీసుకోవాలంటే దూరం వెళ్లాల్సి వస్తుంది. అదే నాగులవంచలో ఏర్పాటు చేసిన డీసీసీబీ చింతకాని బ్రాంచ్‌ని మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో మార్చితే అందరికీ బాగుంటుంది.
– కంచం కోటేశ్వరరావు, రైతు, మత్కేపల్లి

గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు


గోవిందాపురంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

బోనకల్: మండలంలోని గోవిందాపురం, చొప్పకట్లపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లో గురువారం ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో డయేరియా కేసులు నమోదు కావడంతో వైద్యసిబ్బంది ఇంటింట సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్రవంతి మాట్లాడుతూ.. వర్షాకాలంలో నీరు, ఆహారం కలుషితమయ్యే ప్రమాదం ఉందని నీటిని కాచి చల్లార్చి తాగాలని, ఎప్పటికప్పుడు ఆహారాన్ని సిద్ధం చేసుకొని తినాలన్నారు. దోమల ఉధృతి లేకుండా పాత టైర్లు, గాబులు, కొబ్బరిబొండాల్లో నీరు నిల్వ ఉండకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాంతులు, విరోచనాలు అయినట్లయితే వెంటనే వైద్యాధికారిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కావ్యా, సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ దానయ్య, ఏఎన్‌ఎమ్‌లు, ఆశలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాకర్లపల్లి, పాలవాడ కాలనీల్లో..


కాకర్లపల్లి వైద్య శిబిరంలో స్థానికులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని కాకర్లపల్లి, పాలవాడ కాలనీలలో గురువారం గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించారు. రోగులకు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అవినాష్, డాక్టర్ నవ్యశ్రీ, ఏఎన్‌ఎంలు పద్మ, మంజుల, థాయమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బంజర్ చెరువును సర్వే చేయాలి

పెనుబల్లి: వీయంబంజర్ చెరువును సర్వే చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అధికారులను ఆదేశించారు. స్థానికులు కొందరు బంజర్ చెరువును ఆక్రమించారని ఎమ్మెల్యే రాగమయికి ఫిర్యాదు చేయడంతో ఆమె గురువారం చెరువు వద్దకు వచ్చి రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువు హద్దులు గుర్తించి సర్వే చేయాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు సూచించారు.

ఇంటింటి సర్వే పరిశీలన


ముదిగొండ: మండలపరిధిలోని మల్లారం, వల్లబి, పెద్దమండవ గ్రామాల్లో మిషన్ భగీరథపై చేపడుతున్న ఇంటింటి సర్వేను ఎంపీఓ సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

నీట్ ర్యాంకర్‌కు అభినందనలు


భగత్‌ను అభినందిస్తున్న సీపీఎం నాయకులు

వైరా: జాతీయ మెడికల్ ప్రవేశ పరీక్ష (నీట్)లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 595 మార్కులతో ఓపెన్ కేటగిరీలో ఎంబీబీఎస్ చదవబోతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, మాజీ ఎంపీపీ బొంతు సుమతల కుమారుడు బొంతు భగత్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అభినందించారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో భగత్ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, చింతనిప్పు చలపతిరావు, బోడపట్ల రవీందర్, అనుమోలు రామారావు, వెంకటేశ్వరరావు, సుధాకర్, రజిత, నరసయ్య పాల్గొన్నారు.

శరవేగంగా బీటీ రోడ్డు నిర్మాణం


గాంధీనగర్-గాదెపాడు మధ్య వేస్తున్న బీటీ రోడ్డు

కారేపల్లి: మండలంలోని గాంధీనగర్ నుంచి గాదెపాడు వరకు ఐటీడీఏ నిధులు రూ.2కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గాంధీనగర్ నుంచి భూపతిరాయుని చెరువు అలుగు బ్రిడ్జి, చెరువు కట్ట మీదుగా గాదెపాడు వరకు చేపట్టిన ఈ రోడ్డు పనులు చివరి దశకు చేరాయి. ఈ రహదారి అందుబాటులోకి వస్తే మండలంలోని 20గ్రామపంచాయతీల ప్రజలు ఇల్లెందు –ఖమ్మం ప్రధాన రహదారిపైకే కాక కారేపల్లి వచ్చేందుకు మార్గం సుగమమవుతుంది. దీంతో రోడ్డు పనులు మొదలుపెట్టి పూర్తిచేస్తుండడంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

విత్తనాలను సబ్సిడీపై అందించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాస్‌లైన్ నాయకులు

కల్లూరురూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సబ్సిడీపై అందించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కార్యదర్శి కె.పుల్లారావు అన్నారు. గురువారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో కల్లూరు తహసీల్దార్ పులి సాంబశివుడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాగుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు అయినప్పటికీ రాష్ట్రంలో రైతులకు ఇప్పటి వరకు సరిపోను విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందన్నారు. రైతులకు మినీ ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. 2023లో పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి 10వేలు చొప్పున నష్టపరిహారం మంజూరు చేయాలని, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఏక కాలంలోనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు ఆవుకు వెంకన్న, నాయకులు జె.మాల్యాద్రి, జె.పరిమళ, సరోజిని, ఎం.మంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇవ్వాలి

తల్లాడ: గ్రామ సేవకుడిగా పనిచేస్తూ 61 సంవత్సరాలు దాటిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వీఆర్‌ఏల వారసులు వినతిపత్రం సమర్పించారు. తల్లాడ మండల వీఆర్‌ఏ వారసులు షేక్ మొహిసుద్దీన్, నాగేశ్వర్‌రావు, అమర్లపూడి రమేష్, ఇబ్రహీం పాల్గొన్నారు.

పరామర్శ..

సత్తుపల్లి: జిల్లా మున్నూరు కాపుసంఘం ఉపాధ్యక్షుడు రామిశెట్టి సుబ్బారావు సతీమణి లక్ష్మీ సరోజిని ఇటీవల మరణించగా గురువారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా లక్ష్మీ సరోజిని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అదే విధంగా టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, అంకమరాజు, అద్దంకి అనీల్, బొంతు మాధవరావు, దారావత్ నాగరాజు, అమ్ములు, కిషోర్, మట్టా ప్రసాద్, రాజేష్, భాస్కర్, సాయి, దేవళ్ల శ్రీను, గుంజా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉరుములు మెరుపులతో వర్షం


సీపీఎస్ రోడ్డులో విరిగిన విద్యుత్ స్తంభం

మధిర: మండలంలో గురువారం ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. విపరీతమైన గాలితో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. మధిర పట్టణంలోని సీపీఎస్ రోడ్లలో పలు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద ప్రవాహానికి కొద్దిసేపు రాకపోకలు స్తంభించాయి. కొద్ది రోజులుగా విపరీతమైన ఎండ వల్ల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కాలం చల్లబడినట్లు అయింది. ఇప్పటికే పొడి పదునులో పత్తి విత్తనాలు నాటిన వారికి ఈ వర్షం బాగా అనుకూలించింది. మరి కొంతమంది రైతులు ఈ వర్షానికి పత్తి విత్తనాలు విత్తే అవకాశం ఉంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి రోజే పుస్తకాలు, యూనిఫాం మా ఘనతే..


సత్తుపల్లి: ప్రతిభ చూపిన విద్యార్థిని సత్కరించిన ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి/పెనుబల్లి: స్కూళ్లు తెరిచిన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి తెలిపారు. గురువారం పట్టణంలోని పాతసెంటర్ హైస్కూల్‌లో, పెనుబల్లి మండల పరిధిలోని లంకపల్లి, వియంబంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు టేకులపల్లి మోడల్ స్కూల్స్‌లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంను అందజేశారు. అనంతరం ఎస్సెస్సీలో ప్రతిభ చూపిన విద్యార్థిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలవగానే హాస్టళ్లను పరిశీలించి విద్యార్థులు నేలపై పడుకోకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో రూ.1.75 కోట్లు వెచ్చించి మంచాలు, బెడ్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు చదువుతోనే ఉన్నత శిఖరాలకు అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మట్టా దయానంద్, ఎంఈఓ బి.రాములు, ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు, హెచ్‌ఎంలు శైలకుమారి, చిత్తలూరి ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణితో పాటు నర్సింహారావు, కమల్‌పాషా, చెన్నారావు, సామేలు, సాంబశివరావు, మధు, జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు, తహసిల్దార్ గంటా ప్రతాప్, స్థానిక నాయకులు సోమరాజు సీతారామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, చీకటి రామారావు, అలుగోజు చిన్నస్వామి, ఈడా కమలాకర్‌రావు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం చిన్నారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి కోరారు. పట్టణంలోని అయ్యగారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంగతాయారు, రాధ, ఆయా లక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దంతాల సుధాకర్ తన బైక్‌పై బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులను తన బైక్‌పై కూర్చొబెట్టి బడికి తీసుకెళ్తున్నాడు. స్కూల్‌కు సరిగ్గా రాని పిల్లలను గుర్తించి వారి గృహాలకు వెళ్లి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు దంతాల సుధాకర్ చేస్తున్న కృషి అభినందనీయం.

బోనకల్: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు యూనీఫామ్, నోట్‌బుక్స్‌లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యాబోధన జరుగుతుందని వైస్ ఎంపీపీ గుగులోత్ రమేష్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జ్ఞానమే ఈ ప్రపంచానికి వెలుగు

కారేపల్లి: జ్ఞానమే ఈ ప్రపంచానికి వెలుగు లాంటిదని, ప్రతి ఒక్క విద్యార్థి జ్ఞానసముపార్జనకు అంకితభావంతో చదవాలని మండల విద్యాశాఖ అధికారి జయరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని కోమట్లగూడెం (గాంధీనగర్ హైస్కూల్) జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, వెంకటేశ్వర్లు దంపతుల కుమారుడు, కుమార్తె రాహుల్, సుష్మ సహకారంతో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఎంఈఓ జయరాజు ఆవిష్కరించారు. అనంతరం పది ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన జి.వినయ్ కుమార్‌ను ఈ సందర్భంగా ఎంఈఓ, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో


గాంధీనగర్ హైస్కూల్‌లో సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ జయరాజు

ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నామా, మాణిక్యారం హైస్కూల్ హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు విజయ, వేణు, మాధవరావు, పద్మ, జ్యోతి, ప్రేమ్‌సాగర్, రమేష్, వీరభద్రం, శ్రీవాణి, వీఓ జయసుధ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదను అరికట్టండి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిటౌన్: పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని.. వీధుల్లోకి పిల్లలు, పెద్దలు రావాలంటేనే భయపడుతున్నారని పలువురు కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. పట్టణంలో కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ మాట్లాడుతూ.. పట్టణంలోని 23 వార్డుల్లో కల్వర్టులు, బ్యాలెన్స్ సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించేందుకు రూ.2 లక్షలు చొప్పున ఒక్కొక్క వార్డుకు కేటాయించామని తెలిపారు. సమావేశంలో కమిషనర్ ఎం.రవిబాబు, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రామిశెట్టి కుటుంబానికి పరామర్శ

సత్తుపల్లి: జిల్లా మున్నూరు కాపుసంఘం ఉపాధ్యక్షుడు రామిశెట్టి సుబ్బారావు సతీమణి లక్ష్మీ సరోజిని ఇటీవల మరణించగా గురువారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా లక్ష్మీ సరోజిని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అదే విధంగా టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, అంకమరాజు, అద్దంకి అనీల్, బొంతు మాధవరావు, దారావత్ నాగరాజు, అమ్ములు, కిషోర్, మట్టా ప్రసాద్, రాజేష్, భాస్కర్, సాయి, దేవళ్ల శ్రీను, గుంజా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

బోనకల్: ఖమ్మం జిల్లా గిరిజనుల సమగ్ర అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మంలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రావినూతల గిరిజన కాలనీలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ రుణాలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. అనంతరం గిరిజన సంఘం గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బానోత్ నాగేశ్వరరావు, రావూరి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. వీరితో పాటు 12మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంతు నాయక్, గోపి నాయక్, సైదులు, నరేష్, మోతీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా ఆయిల్‌పామ్ సాగు

కొణిజర్ల: ఆయిల్‌పామ్ సాగులో కొణిజర్ల మండల రైతులు జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్నారని ఏఓ డి.బాలాజీ అన్నారు. గురువారం కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో రైతులు పామాయిల్ మొక్కలు నాటుతుండగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొణిజర్ల మండలంలో ఇప్పటి వరకు 1,750 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు అధికంగా సాగుకు ముందుకు రావడంతో గోద్రేజ్ కంపెనీ వారు మండలంలోనే పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపడుతున్నారన్నారు. కొండవనమాల గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేసి రైతులకు మొక్కలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ పరిధిలోని ఏఈఓ లను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అఫ్రీన్, రైతులు పాల్గొన్నారు.

నత్తనడకన ఆదర్శ పాఠశాలలు

- అసంపూర్తిగా నిలిచిన పనులు
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కల్లూరురూరల్: మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం 1.09 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. పనుల నిర్వహణకు గాను సమైఖ్యలకు అప్పగించారు. ఈ మౌళిక సదుపాయాలు పనులు జూన్ 10వ తేదీలోపు పూర్తి కావాల్సి ఉంది. జూన్ 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు అమ్మ ప్రభుత్వ పాఠశాలలకు మరమ్మతు పనులు ఇంత వరకు పూర్తి కాలేదు.

అసంపూర్తిగా పనులు..

మండలంలో ఇంకా అనేక పాఠశాలలో కిటికీలు, తలుపులు బిగించలేదు. అదే విధంగా ఫ్లోరింగ్ పనులు కూడా ఇంకా కొలిక్కి రాలేదు. పాఠశాలలకు నీటి సరఫరా చేసి మినీ ట్యాంకులు ఇంకా బిగించనేలేదు. పాఠశాలలకు రంగులు మాత్రం వేశారు.


ఆదర్శ పాఠశాలలో బండలు వేస్తున్న దృశ్యం

అసహనం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు..

కానీ మౌళిక సదుపాయాలు మాత్రం ఇంకా పూర్తి కాకపోవటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు గ్రామ సమైఖ్యలకు అప్పగించినట్లు పైకి చెబుతున్నప్పటికీ కాంట్రాక్టర్లే చేయిస్తున్నట్లు తెలుస్తోంది. సంబంధిత శాఖ అధికారులు అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల విషయంలో సరిగా పట్టించుకోక పోవడంతోనే పనులు లేటవుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. పాఠశాలలు తెరిచినందున త్వరగా.. పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.